## క్లుప్తంగా

### అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

కనిగిరిరూరల్: పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షణానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం మహమ్మద్ సయనా బేగం తెలిపారు. జూన్ 6 నుంచి కనిగిరి డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ యాత్ర రెండు రోజుల్లో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి, అరుణాచలం, తిరుత్తని ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. జూన్ 9వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు బస్సు బయలుదేరి తిరిగి 12 తేది గురువారం ఉదయం 5 గంటలకు కనిగిరి చేరుతుందని తెలిపారు. టిక్కెట్టు ధర రూ.2,200 మాత్రమేనని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఒకరోజు యాత్ర ఈ నెల 31న శనివారం రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు కనిగిరి డిపో నుంచి మహానంది, అహోబిలం, యాగంటి, బయలు దేరుతుందన్నారు. పుణ్యక్షేత్రాలను సందర్శించుకుని సోమవారం ఉదయం 5గంటలకు కనిగిరి చేరుతుందని టిక్కెట్టు ధర రూ.1,500 తెలిపారు. పూర్తి వివరాలకు 9652260174 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### దేశం మెచ్చిన రేషన్ వ్యవస్థపై రాజకీయ కుట్రా..?

కనిగిరిరూరల్: దేశం మెచ్చిన రేషన్ పంపిణీ వ్యవస్థ పట్ల రాజకీయ కుట్ర చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ బుధవారం ఆయన ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎసరు పెడుతూ అనేక ప్రజా పథకాలకు మంగళం పాడుతుందన్నారు. పేదలకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయడాన్ని రద్దు చేస్తున్న కూటమి సర్కార్ బెల్టుషాపులతో ప్రతి ఇంటికి మద్యాన్ని మాత్రం సరఫరా చేస్తోందని ఘాటుగా విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని, అది ఓర్వలేకనే ఈ దుర్మార్గపు చర్యలకు కూటమి సర్కార్ పాల్పడిందన్నారు. కుంటి సాకులతో ఎండీయూ ఆపరేటర్ల కడుపు కొట్టడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడం వల్ల పేదలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు రేషన్ కోసం ఎన్నో అవస్థలు పడతారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను ఎన్నో రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని గుర్తుచేశారు. ఎండీయూ వాహనాల తొలగింపుతో వేలాది మంది జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

### నవధాన్యాల సాగుతో భూమి సారవంతం


నవధాన్య ప్రదర్శన చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

టంగుటూరు: రైతులు నవధాన్యాలు సాగు చేస్తే భూమి సారవంతమవుతుందని యూనిట్ ఇన్‌చార్జ్ వెంకట్రావు అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద నవధాన్యాలు కిట్స్ బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జ్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రధాన పంట తీసిన తర్వాత భూమిలో నవధాన్యాలు సాగు చేసుకుంటే భూసారం పెరిగి మంచి దిగుబడులు వస్తాయన్నారు. అంతేకాకుండా భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి భూమి బాగా గుల్లబారి సారవంతమవుతుందని చెప్పారు. ఇలా తయారు చేసిన నవధాన్యాల కిట్టు ఎకరా పొలానికి 10 కేజీలు సబ్సిడీతో రైతుకు రూ.600 అందిస్తున్నామని తెలిపారు. ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏఎస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మావతి, రమాదేవి, శృతి పాల్గొన్నారు.

### వార్డులో పర్యటించిన చైర్మన్


సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్త శుద్ధితో వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డు, తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నీరు, వీధి లైట్లు, పారిశుధ్యం, డ్రైనేజీ కాలువలు, రోడ్లు తదితర సమస్యలను ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ సమస్యల పరిష్కారానికి అధికారులను చైర్మన్ గఫార్ ఆదేశించారు. అధికారులు ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. కౌన్సిలర్, పసుపులేటి అరుణోదర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇళ్లలో నిల్వలు.. రైతు కళ్లలో కన్నీళ్లు..


కనిగిరి పొగాకు కేంద్రంలో పొగాకు బేళ్లు


ఇళ్లలోనే పొగాకు బేళ్లు..

- పొగాకు రైతులకు గడ్డు కాలం
- రైతుల ఇళ్లల్లో నుంచి కదలని పొగాకు
- వేలంలో నిత్యం వందల బేళ్లు తిరస్కరణ
- పట్టించుకోని ప్రభుత్వం


ట్రాక్టర్లపైనే పొగాకు బేళ్లు

కనిగిరిరూరల్:

పొగాకు రైతులకు గడ్డు కాలం వచ్చింది. గత మెంతో ఘనం అన్న చందంగా కూటమి ప్రభుత్వ పాలనలో పొగాకు రైతులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా వాణిజ్య పంట అయిన పొగాకును ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో నాణ్యమైన పొగాకు పండిస్తారని కనిగిరికి పేరుంది. అయితే ఈ ఏడాది సాగు ప్రారంభం నుంచి అమ్మకం వరకు రైతులు అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. సాగు ప్రారంభంలో అకాల వర్షాలు ఇబ్బంది పెట్టగా..పొగాకు అమ్మకాల్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పొగాకు రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోజు రోజుకు ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**25 శాతం కూడా కొనుగోళ్లు కాని దుస్థితి**

కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో పొగాకు సాగు విస్తీర్ణం 4,952 హెక్టార్లు. మొత్తం 5 క్లస్టర్ల పరిధిలో 74 గ్రామాల్లో 1245 బ్యార్నీలు ఉన్నాయి. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీలుగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే వేలం ప్రారంభమై రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు 1.8 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారు. నిత్యం వందల సంఖ్యలో బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 25 శాతం కూడా కొనుగోలు జరగలేదు.

**సిండికేట్‌గా వ్యాపారులు..**

పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి పొగాకు రైతులను నట్టేట ముంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా పొగాకు రైతుల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదు. ధరలు లేవని రైతులు వేలాన్ని అడ్డుకొని రోడ్డెక్కుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు వేలం ఇష్టం వచ్చినట్లు ధరలు ఇస్తూ రైతులను ముంచుతున్నారు. వేలంలో కేవలం గ్రేడ్–1 పొగాకును మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన బేళ్లను తిరస్కరిస్తున్నారు. దీంతో నిత్యం వందల సంఖ్యలో బేళ్లు వెనక్కి రావడంతో వాటిని తిరిగి తీసుకురావడం రైతులు ఎన్నో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. కేవలం ఒకటి రెండు కంపెనీలు మాత్రమే వేలంలో యాక్టివ్‌గా ఉండటంవల్లే ధరలు రావడం లేదని రైతులంటున్నారు.

**గతమెంతో ఘనం..**

గతేడాది కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో 7.58 మిలియన్ కేజీల ఉత్పత్తి దిగుబడి వచ్చింది. దాదాపు రైతు దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని బోర్డు అధికారులు, ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వంలో గరిష్ట ధర రూ.360 పైనే రైతులకు వచ్చింది. కనిష్ట ధర రూ.280 వరకు కొనుగోలు చేశారు. ఎందుకు పనికిరాని గుల్లాకు సైతం రూ.250పైనే బోర్డులో కొనుగోలు చేశారు. ఆ ధరలను చూసిన రైతులు ఈ ఏడాది ఎంతో ఉత్సాహంగా పొగాకు సాగు చేశారు. కానీ పంట సరిగ్గా దిగుబడి రాక.. పెట్టుబడులు పెరిగి.. గిట్టు బాటు ధర లభించక లబోదిబోమంటున్నారు.

**ఇళ్లల్లో పేరుకుపోయిన నిల్వలు..**

బోర్డు అధికారులు గిట్టు బాటు ధరలు ఇవ్వక.. అన్ని గ్రేడ్ పొగాకు బేళ్లు కొనుగోలు చేయక పోవడంతో పొగాకు బేళ్లు రైతుల ఇళ్లల్లో గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. అయితే అకాల వర్షంతో మొదటి కొట్టుడు పంట నాణ్యత కొంత మేర తగ్గగా.. రెండో కొట్టుడుకు మంచి నాణ్యత పొగాకు వచ్చింది. అదే రైతు రెండో విడతలో వేసిన పొగాకులో అధిక ఉష్ణోగ్రతలో పంట దెబ్బతింది. వెరసీ పొగాకు రైతుకు గడ్డుకాలం వచ్చింది. అయితే వేలం కేంద్రం వద్దకు రైతు నాల్గు రకాల బేళ్లను తీసుకెళ్లగా.. మంచి రకంగా గ్రేడ్‌ను మాత్రమే తీసుకోవడంతో మిగతా పంటను పలు మార్లు ట్రాక్టర్లలో అద్దెలు కట్టి తీసుకెళ్లలేక. అదనపు పెట్టుబడి పెట్ట లేక రైతు పొగాను గుట్టలు గుట్టలుగా ఇంట్లోనే బేర్చుకుని దిగాలు చెందుతున్నారు..

**అన్ని రకాల పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలి:**



ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి తగ్గింది. నాణ్యమైన పొగాకుతో పాటు.. లోగ్రేడ్, మిడియం పొగాకు దిగుబడి వచ్చింది. బ్యార్నీకి 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మంచి రకంతో పాటు, మిడియం, మాడు రకాలు వచ్చాయి. అయితే పొగాకు బోర్డుకు ఇప్పటికి 5 సార్లు పొగాకు బేళ్లను తీసుకెళ్లినా గ్రేడ్–1 పొగాకునే కొనుగోను చేసి మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నారు. కనిష్ట ధరలు రోజు రోజుకు తగ్గిస్తున్నారు. ధరలు ఇలానే ఉంటే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. అన్ని రకాల పొగాకు బేళ్ల గ్రేడ్‌లను కొనుగోలు చేయాలి.

పోతిరెడ్డి రాజా, రైతు, మాచవరం

# 284 పొగాకు బేళ్లు తిరస్కరణ


టంగుటూరు వేలంలో పాల్గొన్న వ్యాపారులు


రైతులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్


వేలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో 284 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. పొగాకు ధరల విషయంలో, లో గ్రేడు పొగాకు బేళ్లు, తిర్కరణల విషయంలో రైతులు ఎన్ని విధాలుగా నిరసనలు తెలిపినా అటు పొగాకు బోర్డు అధికారుల్లో ఇటు వ్యాపారుల్లో, ప్రభుత్వంలో చలన కలిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 739 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 455 కొనుగోలు జరిగాయి. 284 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ట ధర రూ. 200 పలకగా, సరాసరి రూ.242.53 ధర పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలు తెలపాలి**

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలు తెలియజేయాలని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం వేలం సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ దగ్గర ఉన్న బేళ్ల వివరాలు బోర్డుకు తెలియపరచాలని, అనధికారికంగా పొగాకును అమ్మరాదని సూచించారు. బుధవారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని చౌటపాలెం, దాదానాయుడుపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు 639 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 503 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 136 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.200, సరాసరి ధర కేజీ రూ.243.59గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

**204 పొగాకు బేళ్ల తిరస్కరణ**

కనిగిరిరూరల్: కనిగిరి పొగాకు కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో 204 బేళ్లు తిరస్కరణ అయ్యాయి. ఎనిమిరెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల నుంచి 556 బేళ్లను తీసుకుని రాగా 352 బేళ్లను కొనుగోలు చేసి 204 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి ధర రూ.253.36గా నమదైంది. బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి కోటేశ్వరరావు తెలిపారు.

# రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

సింగరాయకొండ: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రేషన్ డీలర్లకు తహసీల్దార్ టి.రవి దిశానిర్దేశం చేశారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లోనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వాహనాల వ్యవస్థను రద్దు చేసిందని తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పనిసరిగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్ద రేషన్ అందజేయాలని వివరించారు. రేషన్ షాపుల్లో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే వస్తువులను మాత్రమే అమ్మాలని, ఆ ప్రకారం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేయాలి తప్ప ఇతర వస్తువులు అమ్మరాదన్నారు. జూన్ 1వ తేదీ తమ పరిధిలోని ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీని ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ షేక్ ముస్తాక్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు: హెల్మెట్‌తో మీకు, మీ కుటుంబానికి రక్షని ఎస్సై నాగమల్లేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు బుధవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, కోర్టులు ఎన్ని సార్లు చెప్పినా వాహనదారుల్లో మార్పు రావట్లేదన్నారు. హెల్మెట్ లేకుంటే ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ లేని వాహనదారులకు వెంటనే ఫైన్ విధించమని తమకు ఆదేశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ వాడుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరాలని సూచించారు. అనంతరం 15 మందికి జరిమానా విధించారు.

# యోగాతో మానసిక ఉల్లాసం


పొన్నలూరులో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగస్తులు


టంగుటూరు: యోగా చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పొన్నలూరు: రోజూ యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పొందవచ్చని తహసీల్దార్ పుల్లారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు శాఖల ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ట్రైనర్ శ్రీదేవి పలు రకాల ఆసనాలు వేయించారు. అనంతరం తహసీల్దార్ పుల్లారావు యోగా సాధనతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎంపీడీఓ డాక్టర్ సుజాత, ఎంఈఓ రవిచంద్రబాబు, ఏపీఓ సుధాకర్ పాల్గొన్నారు.

టంగుటూరు: సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంపీడీవో దేవసేనకుమారి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జూన్ 20 వరకు యోగా మాసంగా పరిగణించి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగాకు సమయం కేటాయించాలన్నారు. యోగా శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగా ట్రైనర్, పీడీ అరుణ, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలో జూన్ 21వ తేదీ జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే వారి జాబితాను సిద్ధం చేసేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేయాలని ఎంపీడీఓ డి.జయమణి సూచించారు. మండలంలో 67,494 గృహాలు ఉండగా వాటిలో 27,813 గృహాల వారిని యోగా దినోత్సవం రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేలా సన్నద్ధం చేయాలన్నారు. ఇప్పటి వరకు వివిధ శాఖల వారు ఇంటింటి సర్వే చేయకుండా వారికి అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా వీఓఏలు, ఇతర శాఖల అధికారులు ఒక చోట కూర్చొని ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు ప్రకారం నమోదు చేసి ఓటీపీ లబ్ధిదారునిచేత చెప్పించుకుని నమోదు చేశారని, ఆ విధంగా చేసిన నమోదు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారుల వద్ద వేలిముద్రలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసి యోగా చేసేలా కృషి చేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెలాఖరు వరకు గ్రామ స్థాయి అధికారులకు యోగాపై శిక్షణ ఇస్తున్నామని, వీరు తర్వాత గ్రామస్థాయిలో ప్రజలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

# వైభవంగా గుంటెయ్య స్వామి తిరునాళ్ల


ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ యాదవ్

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): మండలంలోని రాళ్లపల్లిలో గుంటియ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహిచంచారు. పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం, నాయకులు నన్నసాని నారాయణ, గంగయ్య, మోడి నారాయణ, ఎంపీటీసీ గిద్దా బ్రహ్మయ్య, గిద్దా తిరుపతయ్య, బాలనారాయణ, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, సైకం ఏడుకొండలు రెడ్డి, సర్పంచ్‌లు జేమ్స్, తాతపుడి సురేష్, గొబ్బిళ్ల శ్రీను, మాల్యాద్రి, వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి ఉత్సవమూర్తుల అందజేత


శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయంలో స్వామి జేష్ఠమాస పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జేష్ఠమాసం విశిష్టతను సంతరించుకోవడంతో ఆలయానికి మండలంలోని జీనుగువారిపల్లె గ్రామానికి చెందిన పత్తి పెద్ద వెలుగొండయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి పత్తి జయమ్మ శ్రీతిరుమలనాథస్వామి, శ్రీదేవి, భూదేవి పంచలోహ ఉత్సవమూర్తులను అందజేశారు. ఉత్సవ విగ్రహమూర్తులకు అర్చకులు రామమూర్తి దాతలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగిరెడ్డి రామచంద్రారెడ్డి, ముత్యాల వెంకటకొండారెడ్డి, జి.వెంకటనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పత్తి రవి, స్వప్న, గుర్రం నరేంద్ర, సిద్ధవటం రామయ్య, సావిత్రమ్మ, భక్తులు పాల్గొన్నారు.

### మంత్రి ఇలాకాలో ఎన్టీఆర్‌కు అవమానం

- ఎన్టీఆర్ జయంతి రోజు విగ్రహానికి దండ కరువు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి స్వగ్రామంలో ఎన్టీఆర్‌కు అవమానం జరిగింది. కడపలో జరుగుతున్న మహానాడులో బిజీబిజీగా ఉన్న మంత్రి స్వామి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం కనీసం పూలమాలలు వేసే వారు కరువయ్యారు. రాష్ట్రం మొత్తం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తుంటే మంత్రి స్వగ్రామంలో ఆ కార్యక్రమాన్ని పట్టించుకునే వారే లేకపోయారు.


తూర్పునాయుడుపాలెంలో పూలమాలలు లేని ఎన్టీఆర్ విగ్రహం

### ప్రజా పోరాటాలకు సిద్ధం కండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ

కనిగిరిరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో సీపీఐ మండల మహాసభలు గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కూటమి సర్కార్ హామీల అమలులో తీవ్రంగా విఫలం చెందిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేంత వరకు సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. ఆగస్టులో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను, జూన్‌లో దర్శిలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై సీపీఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు వై ప్రభాకర్ ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర మాజీ నేత బ్యంగి సుబ్రహ్మణ్యం, సీపీఐ, వివిధ సంఘాల నాయకులు పందిమోహన్, ఖాదర్ మస్తాన్, జయంపు అంకమ్మ, గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### 150 మామిడిచెట్ల నరికివేత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచెలక గ్రామం చట్టా వరలక్ష్మికి చెందిన మామిడి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ ఘటనపై బుధవారం స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రేగులచెలక గ్రామానికి చెందిన చట్టా వరలక్ష్మికి సర్వేనంబర్ 46/1 లో 4.50 ఎకరాల్లో 2022లో మామిడి మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తన మామిడితోటలో వరలక్ష్మి 26 సాయంత్రం వరకు పొలంలోనే ఉంది. కాగా 27వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో పొలానికి వెళ్లి చూడగా 150 మామిడి చెట్లు నరికివేతకు గురయిఉన్నాయి. దీనిపై దిక్కుతోచనిస్థితిలో వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. దీనిపై రైతు వరలక్ష్మి మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏడుగురిపై అనుమానంగా ఉందని, పాతకక్షలు ఉన్నాయని అవి మనసులో పెట్టుకుని తమ మామిడి చెట్లను కొట్టివేసి ఉంటారని, విచారణచేసి తమకు న్యాయంచేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొంది.


నరికివేతకు గురైన మామిడి చెట్టు